ప్రజాశక్తి

గురువారం 30 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

బలహీనపడ్డ మొంథా

- తగ్గిన సముద్ర అలల ఉధృతి
- ఊపిరి పీల్చుకున్న జనం
- విశాఖలో 40 మి.మీ వర్షపాతం నమోదు
- పునరావాస కేంద్రాలు, సహాయక చర్యలపై యంత్రాంగం దృష్టి



మరమ్మతులు చేస్తున్నారు.

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

మొంథా తుపానుతో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండవాలు ప్రాంత ప్రజలు భయాందోళనతోనే గడుపుతున్నారు. పలుచోట్ల ఇంకా రహదారులపైనే నీరు ప్రవహిస్తోంది. పలుచోట్ల ఇళ్ల గోడలు, ప్రహరీలు కూలిపోయాయి. కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది.

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుపాను మంగళవారం నాటికి తీవ్ర తుపానుగా మారిన నేపథ్యంలో పడ్డ వర్షాలు, వీచిన గాలులకు విశాఖ, జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్థమైంది. విశాఖలో లోతట్టు ప్రాంతాల జనం, కొండవాలు చుట్టూ నివసించే ప్రజలు ఇంకా భయాందోళనతోనే ఉన్నారు. సుమారు లక్ష మందికి పైగా ప్రజలు ఈ ప్రాంతాల్లో జీవిస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లు అధికంగానే ఉన్నాయి. విశాఖ తీరం అల్లకల్లోలంగా మారింది. కల్వర్టులు, రోడ్లు, సాగునీటి చెరువులు, గెడ్డలు, పూరిళ్లు, కచ్చా ఇళ్లు ఇలా చాలావరకూ దెబ్బతిన్నాయి. వీటన్నిటినీ యుద్ధప్రాతిపదికన రిపేర్లు చేసి యథాతథ స్థితికి తీసుకురావడంలోనే యంత్రాంగం కృషి ఆధారపడి ఉంటుంది.

ఊపిరిపీల్చుకున్న విశాఖ....

బుధవారం ఉదయం 8.30 గంటల నాటికి తీవ్ర తుపాను బలహీనపడడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. విశాఖ సాగర తీరంలో అలల ఉధృతి బుధవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. జిల్లా అధికార యంత్రాంగం గడచిన మూడురోజులూ అహర్నిశలూ పునరావాస చర్యల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం తుపాను వెళ్లిపోవడంతో సహాయక చర్యలపై దృష్టిసారించారు. విశాఖ జిల్లాలో ఈ నెల 28వ తేదీన అత్యధికంగా 1625 మి.మీ వర్షపాతం నమోదు కాగా బుధవారం ఉదయం నుంచి 11గంటల వరకూ 40 మి.మీ వర్షపాతం నమోదైంది. 28వ తేదీ ఉదయం 8.30గంటల నుంచి బుధవారం ఉదయం 8.30గంటల వరకూ వర్షపాతం 368 మి.మీగా నమోదైంది. మేఘాద్రిగెడ్డ, గంభీరం, తాటిపూడి రిజర్వాయర్లు నీటిసామర్థ్యాన్ని మించి ప్రవహిస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 83 రిలీఫ్ కేంద్రాల్లో 21 వేల మందికి సరిపడా ఏర్పాట్లను అధికార యంత్రాంగం చేసినప్పటికీ వీటిలో 16 శిబిరాల్లోనే జనం 1500మంది వరకూ బాధితులు ఉన్నారు. విశాఖ జిల్లాలో 21 గ్రామాలు తుపానుకు ప్రభావితమై 383 మంది వ్యవసాయ రైతులు ప్రభావితులయ్యారు. వరికి 107 హెక్టార్లులో నష్టం జరిగిందని అధికారిక లెక్కలు తెలియజేస్తున్నాయి. మొక్కజొన్న, పత్తి పంటలకు ఎలాంటి నష్టం వాటిళ్లలేదు. 22 ఇళ్ల గోడలు కూలిపోయాయి. వాటన్నిటినీ అధికార యంత్రాంగం సహాయక చర్యల్లో భాగంగా

నిత్యావసర సరకుల పంపిణీపై యంత్రాంగం దృష్టి...

మొంథా తుపాను బాధిత పునరావాస కేంద్రాల్లో ఉండేవారికి నిత్యావసర సరకులను పంపిణీ చేసేందుకు యంత్రాంగం సిద్ధమైంది. బియ్యం, ఉల్లిపాయలు, కందిపప్పు, కూరగాయలు, ఆయిల్, పంచదార వంటి సరకులను అందించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : సాంకేతిక. నిర్వహణ కారణాల వల్ల, రైల్వే అధికారులు ఈ నెల 30వ తేదీన బయలుదేరాల్సిన పలు ముఖ్యమైన పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. ఈ మార్పుల కారణంగా ఆయా మార్గాల్లో ప్రయాణించాలనుకునే ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు కోరారు. రద్దయిన వాటిలో 58502 కిరండూల్ –విశాఖపట్నం పాసింజర్, 5837 కోరాపుట్ – విశాఖపట్నం పాసింజర్, 18045 షాలిమార్ – చెర్లపల్లి ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 12703 హౌరా – సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, 58501 విశాఖపట్నం – కిరండూల్ పాసింజర్, 18516 కిరండూల్ – విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్, 8520 లోకమాన్య తిలక్ టెర్మినస్ – విశాఖపట్నం ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్, 11019 సిఎస్‌టి ముంబై– భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్, 17479 పూరీ – తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి.

ఎపిపిసిబిని బలపరచాలి

పవన్‌కల్యాణ్‌కు ఇఎఎస్ శర్మ లేఖ

వార్త మెయిన్‌లో..

నేడూ పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మొంథా తుపాను నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని విశాఖ జిల్లాలో 10వ తరగతి వరకు ఉన్న అన్ని పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు గురువారం సెలవు ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ మీడియాకు ప్రకటించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు.

తుపాను నష్టాలను అంచనా వేయండి : కలెక్టర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మొంథా తుఫాను నష్టాలను జాగ్రత్తగా అంచనా వేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. తుపాను అనంతరం తీసుకోవలసిన చర్యలపై జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, జోనల్ అధికారులు, రెవెన్యూ అధికారులతో బుధవారం ఉదయం కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సాధారణ పరిస్థితులు తీసుకు రావాలని, పారిశుధ్యం, నీటి వనరుల క్లోరినేషన్, దెబ్బతిన్న రోడ్లపై గుంతలు పూడ్చడం, ల్యాండ్ స్లయిడింగ్ జరిగిన చోట రోడ్ల పునరుద్ధరణపై జోనల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ చెప్పారు. తుపాను నష్టాలను జాగ్రత్తగా అంచనా వేయాలని, పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న గృహాలను నమోదు చేయాలన్నారు. పంట, పశు, బోట్లు నష్టం అంచనాలను తయారు చేయాలని చెప్పారు. దెబ్బతిన్న పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, మైనర్ ఇరిగేషన్, పాఠశాలల భవనాలు అంచనాలు తయారుచేయాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిరాశ్రయులైన వారికి, తుపాను వల్ల ఉపాధి కోల్పోయిన మత్స్యకారులను గుర్తించి పరిహారం అందించడానికి చర్యలు తీసుకోవాలని

మిగతా 2లో..

తుపాను ప్రభావ ప్రాంతాల్లో త్వరితగతిన చర్యలు

- జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-విశాఖపట్నం : మొంథా తుపాన్ నేపథ్యంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, గాలులకు విశాఖలో తలెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంలో జివిఎంసి యంత్రాంగం సఫలమైందని కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. జివిఎంసి అధికారులు, సిబ్బంది పూర్తి సహాయక చర్యల్లో నిమగ్నమై తమ విధులను నిర్వహించారని, సిటీ ఆపరేషన్స్ సెంటర్ నుండి ఉన్నతాధికారులు నిరంతరం పరిస్థితులను పరిశీలిస్తూ దిగువ స్థాయి అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారని కమిషనర్ ప్రకటించారు. తుపాను కారణంగా మూడు రోజులుగా ప్రజల నుండి సిటీ ఆపరేషన్స్ సెంటర్‌కు 229 ఫిర్యాదులు అందగా 224 సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించినట్లు తెలిపారు. కొండవాలు, లోతట్టు ప్రాంత ప్రజల కోసం 79 పునరావాస కేంద్రాలను గుర్తించామని, అందులో 13 పునరావాస కేంద్రాలలో 293 మంది ప్రభావిత ప్రాంత ప్రజలను తరలించి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని చెప్పారు. 160 చెట్లు కూలిపోగా 157 తొలగించామని, 10 వీధిలైట్లు నేల కూలగా వాటిని పునరుద్ధరించామని తెలిపారు. 20 భూగర్భ డ్రైనేజీ నాళాలు, వర్షాభావం వల్ల భారీగా 30 చోట్ల వరద నీరు నిలువ ఉన్నట్లు గుర్తించి వాటి అడ్డంకులను తొలగించి యథా స్థానానికి తీసుకొచ్చామని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి..

తుపాను నష్టాలను అంచనా వేయండి : కలెక్టర్

తెలిపారు. నష్టం అంచనాలను గురువారం సాయంత్రానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా క్షేత్ర స్థాయిలో టీమ్‌గా పని చేసిన అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారని చెప్పారు. జిల్లాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా వెంటనే పునరుద్ధరించిన అధికారులను, ప్రత్యేక అధికారులను కలెక్టర్ అభినందించారు.

అంధ కళాకారులకు రూ.4.20 లక్షల విరాళం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : చిన్న వయసులోనే వండర్ కిడ్స్ విద్యార్థులు పెద్ద మనసు చాటుకున్నారు. దృష్టి లోపం గల కళాకారుల సహాయానికి ముందుకొచ్చి రూ.4.20 లక్షలు విరాళంగా అందజేశారు. సింహాచలం ప్రాంతానికి చెందిన వై.అమ్మినాయుడు నాయకత్వంలో ఉన్న 13 మంది దృష్టి లోపం గల సంగీతకారులు స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్, సిటీ, గాజువాక శాఖల విద్యార్థుల కోసం ఒక ప్రేరణాత్మక ఆర్కెస్ట్రా ప్రదర్శన ఇచ్చారు. వారి ప్రదర్శనతో ప్రభావితమైన విద్యార్థులు దాతృత్వభావంతో ముందుకొచ్చి అంధ కళాకారులను ఆదుకునేందుకు మొత్తం రూ.4,20,110 విరాళంగా అందించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును బుధవారం స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మళ్ల రామునాయుడు, డైరెక్టర్ ఎం.వాణిశ్రీ, రొంగలి రమణ, ప్రిన్సిపల్ సంగీతా రాణి, చట్టి గోపి, చట్టి రమణ, సీనియర్ టీచర్లు భార్గవి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బురుజుపేటలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీని బుధవారం లెక్కించారు. ఆగస్టు 20 నుండి అక్టోబర్ 29వ తేదీ వరకు హుండీ ఆదాయాన్ని లెక్కించగా నగదు రూ.48,07,930 నగదు, బంగారం 61 గ్రాముల 510 మిల్లీ గ్రాములు, వెండి 941 గ్రాములు, అమెరికా, సింగపూర్, సౌదీ అరేబియా, ఒకేరా దేశానికి చెందిన ఫారన్ కరెన్సీ వచ్చినట్లు దేవస్థానం ఉప కమిషనర్, కార్య నిర్వహణాధికారి కె.శోభారాణి మీడియాకు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానం కార్య నిర్వహణాధికారి టి.రాజగోపాల్‌రెడ్డి, ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారులు ఎన్.ఆనంద్‌కుమార్, కె.రాజేంద్రకుమార్, పర్యవేక్షకులు ఎంవి.రమణ, ఎన్.కనకారావు, కె.పద్మజ, ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ జె.నరసింహారావు, వన్ టౌన్ పోలీసు సిబ్బంది, గోపాలపట్నం శ్రీవారి సేవా సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

మేక్ మై ట్రిప్ 'ట్రావెల్ కా ముహూరత్' ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతదేశంలోని ప్రముఖ ఆన్‌లైన్ ట్రావెల్ కంపెనీ మేక్‌మైట్రిప్ సంవత్సరాంతపు ప్రయాణ సీజన్‌ను లాంఛనంగా ప్రారంభించేందుకు 'ట్రావెల్ కా ముహూరత్' కొత్త క్యాలెండర్ మూమెంట్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా విశాఖలోని నోవాటేల్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మేక్‌మైట్రిప్ డైరెక్టర్ రాజేష్ మాగోవ్ మాట్లాడుతూ, ఈ ప్రత్యేక సీజన్‌లో భాగంగా, మేక్‌మైట్రిప్ దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులకు అత్యుత్తమ విలువ అందించడానికి ప్రముఖ విమానయాన సంస్థలు, హాస్పిటాలిటీ బ్రాండ్లు ప్రధాన బ్యాంకింగ్ భాగస్వాములతో జతకట్టినట్లు వివరించారు. విమానాలు, హోటల్ వసతులు, హాలిడే ప్యాకేజీలు, గ్రౌండ్ ట్రాన్స్‌పోర్ట్, పర్యటనలు వంటి ప్రధాన సేవలతో పాటు వీసా, ఫారెక్స్, ట్రావెల్ ఇన్స్యూరెన్స్ వంటి ప్రయాణ నిత్యావసరాలను కూడా ఇందులో అందిస్తున్నారు. 'ట్రావెల్ కా ముహూరత్' ప్రారంభ ఎడిషన్ ఈ నెల 29 నుండి నవంబర్ 30వ తేదీ వరకు ఉంటుందని, ప్రతి వారం దేశీయ, అంతర్జాతీయ విశ్రాంతి గమ్యస్థానాలైన బీచ్‌లు, కొండలు, సాంస్కృతిక ప్రాంతాలు, నగర విహారాలను హైలైట్ చేయనున్నట్లు వివరించారు. బ్లాక్ ఫ్రైడే డీల్స్ ప్రతి శుక్రవారం అందుబాటులో ఉంటాయని, లైట్నింగ్ డ్రాప్స్ పరిమిత ఇన్వెంటరీ ఆఫర్‌లు ప్రతిరోజూ సాయంత్రం 6 రాత్రి 9 గంటల వరకు ఉంటాయని తెలిపారు. మేక్‌మైట్రిప్ బ్లాక్ సభ్యులు ప్రత్యేక ముందస్తు యాక్సెస్ ఉంటుందని పేర్కొన్నారు.

నిరాశ్రయులకు నిత్యావసరాలు

విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తుపాను వల్ల నిరాశ్రయులైన వారికి ప్రభుత్వం 25 కిలోల బియ్యం, ఒక కిలో కందిపప్పు, ఒక లీటర్ ఆయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళ దుంపలు, కిలో పంచదార ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. తుపాను వల్ల వేటకు వెళ్లలేక భృతిని కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలకు 50 కిలోల బియ్యం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. నిరాశ్రయులై రిలీఫ్ కేంద్రాలకు వచ్చిన వారు తిరిగి వెళ్లేటప్పుడు ఒక్కరికి రూ.వెయ్యి, ఒక కుటుంబంలో గరిష్టంగా రూ.3 వేలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం వాస్తవమైన లబ్ధిదారుల జాబితా తయారుచేయాలని సంబంధిత అధికారులకు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

విశాఖపట్నం- బొబ్బిలి సెక్షన్‌లో ఇంటర్-జోనల్ ఆడిట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం - బొబ్బిలి రైల్వే సెక్షన్‌లో భద్రతా ప్రమాణాలను సమీక్షించేందుకు, పటిష్టపరిచేందుకు ఈశాన్య సరిహద్దు రైల్వే మాలిగావ్ (గౌహతి) నుంచి వచ్చిన ప్రత్యేక ఇంటర్-జోనల్ భద్రతా తనిఖీ బృందం విస్తృత ఆడిట్ నిర్వహించింది. ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ ఉత్తమ్ ప్రకాష్ నేతృత్వంలోని బృందం వాల్తేరు డివిజన్‌లోని విశాఖపట్నం- బొబ్బిలి సెక్షన్‌ను తనిఖీ చేశారు. ఈ బృందం ప్రధాన స్టేషన్లు, లెవల్ క్రాసింగ్‌ల వద్ద భద్రతను పరిశీలించారు. పెందుర్తి -కొత్తవలస మధ్య కర్వ్ నంబర్ 8, కొత్తవలస స్టేషన్ యార్డ్, దాని పాయింట్స్, క్రాసింగ్స్, ఆలమండ-కోరుకొండ మధ్య ఉన్న మేజర్ బ్రిడ్జి, మటిపల్లి వద్ద ఉన్న ట్రాక్షన్ సబ్-స్టేషన్, యార్డు, బొబ్బిలి స్టేషన్ రిలే రూమ్, విశాఖపట్నం వద్ద ఉన్న కోచింగ్ క్రూలాబీ, యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ ఎక్విప్‌మెంట్ వ్యాన్, యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, న్యూ కోచింగ్ కాంప్లెక్స్, రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ క్యాబిన్‌లను పరిశీలించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా తనిఖీ బీందంతో సమావేశమై భద్రతా పరిశీలనలను సమీక్షించారు.

పోషకాహారానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : రుతువులు మారే సమయంలో ఆరోగ్య రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మ్యాక్స్ హెల్త్‌కేర్‌లో రీజినల్ హెడ్ ఆఫ్ డైటెటిక్స్ న్యూట్రిషనిస్ట్ రితక సమద్దార్ తెలిపారు. విశాఖలోని ప్రయివేటు హోటల్‌లో నిర్వహించిన ఆరోగ్య సంరక్షణ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఉష్ణోగ్రతల్లో మార్పులు, పెరిగే అలర్జీ కారకాలు వల్ల రోగనిరోధక వ్యవస్థపై భారం పెరుగుతుందని, దీని ఫలితంగా ప్రజలు జలుబు, ఫ్లూ, అలసట బారిన సులభంగా పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో, రోగనిరోధక శక్తిని పెంపొందించుకునే పోషకాహారానికి ప్రాధాన్యత ఇవ్వడం అత్యవసరం అన్నారు. బలమైన రోగనిరోధక వ్యవస్థకు సమతుల్య ఆహారం, మంచి అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలి కీలకమని, పోషకాలు అధికంగా ఉండే బాదం, ఆకుకూరలు, కొవ్వు ఉండే చేపలు తదితర ఆహారాలను దినచర్యలో చేర్చుకోవాలని సూచించారు. శరీర సహజ రక్షణ వ్యవస్థను బలంగా ఉంచడానికి తేలికపాటి వ్యాయామం చేయాలన్నారు.

బాల్య వివాహాలు, మత్తు పదార్థాల వాడకం నిర్మూలించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బాల్యవివాహాలు, మత్తు పదార్థాల వాడకం యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, వాటిని నిర్మూలించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు కోరారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం సంస్థ కార్యాలయంలో 'బాల్య వివాహాల నివారణ, మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కల్పించే పోస్టర్, కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, బాల్య వివాహాలు, మత్తు పదార్థాలు వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువత చట్టపరమైన అవగాహనతో ముందుకు రావాలని, సమాజం మొత్తం కలిసి ఈ సమస్యను నిర్మూలించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. న న్యా ని నా య ం ం డ ం పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిన్నంశెట్టి రాజు

కెజిహెచ్‌లో 'వరల్డ్ స్ట్రోక్ డే'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా కెజిహెచ్‌లో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200 మంది వైద్యులు హాజరు కాగా వారందరికీ అనుభవజ్ఞులు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఎంసి ప్రిన్సిపల్, అదనపు డిఎంఇ డాక్టర్ కెవిఎస్ఎం సంధ్యాదేవితో పాటు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, కెజిహెచ్ అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ బివి.రమణ హాజరై మాట్లాడారు. ఎఎంసి న్యూరాలజీ విభాగాధిపతి, డాక్టర్ సీపాన గోపీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విశాఖకు చెందిన పలువురు మహిళా న్యూరాలజిస్టులు, ఫ్యాకల్టీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, మెడిసిన్ విభాగాలకు చెందిన పీజీలు పాల్గొన్నారు.

నష్టాలపై ఆరా.. సహాయానికి భరోసా!



వరదబాధితులను పరామర్శించేందుకు బోటులో వెళ్తున్న ఎమ్మెల్యే గంటా

ముంపు ప్రాంతాల్లో నేతలు, అధికారుల సందర్శన



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి -తగరపువలస: భీమునిపట్నం మండలం పెద నాగమయ్యపాలెంలో ముంపు బాధితులను. స్థానికఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బోటులో వెళ్లి పరామర్శించారు. తుపాను పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న 32 కుటుంబాలకు నిత్యావసరాలను అందజేశారు. వరద నీరు ముంచెత్తడంతో మునిగిపోయిన వేలాదిమంది దివీస్ ఉద్యోగులు రాకపోకలు సాగించే చిప్పాడ గ్రామ రహదారిని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డిఓ సంగీత మాధుర్, జెడ్‌సి అయ్యప్ప నాయుడు, తహశీల్దార్ రామారావు నాయకులు గాడు వెంకటప్పడు. మండల పార్టీ అధ్యక్షులు సరగడ అప్పారావు. డిఎవన్ రాజు, సింగుపూర్ బుజ్జి, ఎర్రబాల అనిల్‌ప్రసాద్. మాజీ వైస్ ఎంపీపీ పరశురాం ఉన్నారు.

రెండోవార్డు చిల్లపేట, జీరుపేటను సందర్శించిన ఎమ్మెల్యే గంటా, అక్కడ మురుగునీటి కాలువ ఉప్పొంగి ఇళ్లల్లోకి చొరబడడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై పరిశీలించారు. స్థానిక సమస్యలను కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, ఎమ్మెల్యేకు వివరించగా,తక్షణ చర్యలను జెడ్‌సి అయ్యప్పనాయుడును ఆదేశించారు. ఎఇఇ కొప్పల రమేష్, తమ్మిన సూరిబాబు, శివశంకర్‌రెడ్డి ఉన్నారు.

తగరపువలస: అమనాం పంచాయతీలో ఈదురుగాలులకు ఒరిగిన కొబ్బరితోటలు, వరిపైర్లు, పూలతోటలను టిడిపి గ్రామ అధ్యక్షులు కంబప్ప శివకుమార్, మాజీ సర్పంచ్ దంతులూరి నృసింహ సత్యనారాయణరాజు ఉద్యానవన శాఖాధికారిని వాకా భానుపుష్ప లీలావతితో కలిసి పరిశీలించారు, రైతులతో మాట్లాడారు. గ్రామ రహదారిలో కల్వర్టు పైనుంచి పొంగి ప్రవహిస్తున్న నీటిని మండల ఇంజనీర్ రాజేష్ పట్నాయక్ తో కలిసి పరిశీలించారు.. శివాలయం వద్ద కల్వర్టు పైనుంచినీటి ప్రవాహాన్ని, రామకోవెల నుండి శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో రోడ్డుపై చేరిన మురుగునీరు, జీరుపేటలో కూలిన అంగన్వాడీ గోడను పరిశీలించారు.కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మీనా, నాయకులు దంతులూరి రవి, దాసరి సూరిబాబు, కొయ్య విశ్వనాథం.చుక్క సూరిబాబు, కర్రి నర్సింగరావు పాల్గొన్నారు

భీమునిపట్నం : తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పర్యటించారు. బోయివీధికి అనుకుని కోతకు గురైన తీరాన్ని పరిశీలించారు. మత్స్యకార కుటుంబాలను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జమ్మి చెరువు పార్కును పరిశీలించారు ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ పైలా రామారావు, జెడ్‌సి ఒ మ్మి అయ్యప్ప నాయుడు, టిడిపి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గుర్నాథ్, కనకల అప్పలనాయుడు, కె కామేష్ పాల్గొన్నారు.

ములగాడ: పారిశ్రామిక ప్రాంతంలోని ఎకెసి కాలనీ, రాజీవ్ కాలనీ మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపం రహదారి, తదితర ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సందర్శించారు. ప్రజల సమస్యలను అడుగు తెలుసుకున్నారు, ముంపు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలనిఅధికారులను ఆదేశించారు. మల్కాపురం సిఐ గొలగాని అప్పారావు, వార్డు టిడిపి నేత గేదెల వెంకటరమణ ఉన్నారు.

వేపగుంట : జివిఎంసి 93వ వార్డు కృష్ణానగర్ గ్రామంలో పొంతపల్లి కాంతమ్మ పెంకిటిల్లు పాక్షికంగా దెబ్బతింది ఇంటిపైకప్పు తాటి దూలం వేలాడి, పెంకులు రాలిపోయాయని బాధితురాలు వాపోయింది. రెవెన్యూ అధికారులు సందర్శించి, పరిశీలించారు

మధురవాడ,: జివిఎంసి ఐదో వార్డు గంభీరం జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో తెలుగు యువత నేత గంటా రవితేజ బుధవారం పర్యటించారు. తాగునీరు, డ్రైనేజ్ సౌకర్యాల పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తుఫాను తీవ్రత వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమైందన్నారు. అస్తవ్యస్త డ్రైనేజ్ వ్యవస్థ కారణంగా వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక కార్పొరేటర్ మొల్లి హేమలత, వై.జీవన్ కుమార్, బమ్మిడి తారక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధిత రైతులను ఆదుకోవాలి

ఆనందపురం: తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలలో పంటలు నీటి మునిగాయి. వరదనీరు ముంచెత్తడంతో వరిపైర్లు నీట మునిగాయి. పలు గ్రామాల్లో ముంపు పైర్లను వైసిపి యువజన విభాగం జిల్లా కార్యదర్శి ఇల్లపు వెంకట్ జగన్ పర్యటించి, పరిశీలించారు. పంట నష్టాలను అంచనా వేసి తగు పరిహారం చెల్లించడం ద్వారా బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు.

మూడు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు

పద్మనాభం : వర్షబీభత్సంతో రోడ్డుపైకి నీరు ముంచెత్తడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడిన మం. మండలంలోని చిన్నాపురం, మద్ది, పాండ్రంగి ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి వివరాలను వెల్లడించారు.. గోస్తనీ నది పరివాహక ప్రాంతం పాండ్రంగి వద్ద, విజయనగరం, సింహాచలం రహదారిలో మద్ది వద్ద పల్లి గెడ్డ ఉధృతితోనూ,. చిన్నాపురం జంక్షన్ వద్ద చెరువు నీరు రోడ్డుపైకి రావడంతో మూడు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లించామన్నారు. తొమ్మిది ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోగా వెంటనే పునరుద్ధరించామన్నారు. బిఆర్ తాళ్లవలస పంచాయతీ బొచ్చ పేట గ్రామానికి ఉన్న తులసిబండ నీరు పొంగి గ్రామంలోనికి చేరే సమయానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారంతో జెసిబిని తెచ్చి గండి కొట్టించడం ద్వారా నీటి ఉధృతిని అరికట్టామన్నారు. పది చోట్ల విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించామన్నారు. గ్రామాల్లో తాగునీటి వనరుల క్లోరినేషన్, విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టామన్నారు.తుఫాన్ ప్రభావంతో ఒక ఆవు, ఒక మేకు మృతి చెందిందన్నారు. అనంతవరం, రౌతుల కాలం, బాంధేవపురంలో ప్రసవానికి చేరువలో ఉన్న ముగ్గురు గర్భిణులను ప్రత్యేక వాహనంలో విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించామన్నారు. పలు గ్రామాల్లో 42 ఎకరాల్లో వరి, 45 ఎకరాలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. 30మంది గిరిజనులకు పునరావాసం కల్పించి, భోజన, వసతి సౌకర్యాలను కల్పించామన్నారు. వారికి ఒక్కొక్కరికీ 25 కేజీలు బియ్యం ఉచితంగా అందజేశామన్నారు. పాడైన రోడ్లు మరమ్మతులకు రూ.25లక్షలు మంజూరు చేస్తామన్నారు. గ్రామాల్లో 13 ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆనందరావు ఎంపిడిఒ కె. రూపేష్, ఎఇ ఎం వెంకటాచలం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ హరీష్, విద్యుత్ ఎఇఇ జగన్మోహనరావు, వైద్యాధికారి డాక్టర్ లీలా ప్రసాద్, వెటర్నరీ డాక్టర్ మహేష్ పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన రెండు చెరువుల్లోని చేపలు

మండలంలోని బి.తాళ్లవలసలో వరదనీరు ముంచెత్తడంతో బూరెల చెరువు, కూనగెడ్డ చెరువులకు వేసిన వలలు కొట్టుకుపోయి చేపలన్నీ వెళ్లిపోవడంతో తీవ్ర నష్టం జరిగిందని పెంపకందారులు పోరాట రమణ, పైలా శ్రీను వాపోతున్నారు. పంచాయితీ అనుమతితో వేలంపాడి చెరువుల్లో చేపల పెంపకం చేపట్టామని, వర్షాలతో వలలతోపాటు చేపలు కొట్టుకుపోయాయని తెలిపారు.



పద్మనాభంలో పొలాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి జ్ఞానవేణి

పునరావాస కేంద్రాన్ని సందర్శించిన మేయర్



పునరావాస కేంద్రంలో వైద్యశిబిరం పరిశీలిస్తున్న మేయర్

పెందుర్తి : మొంథా తుఫాన్ కారణంగా జివిఎంసి ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని వారికి అన్ని సదుపాయాలు కల్పించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. బుధవారం పెందుర్తి జంక్షన్‌లో తాండ్రపాపారాయుడు కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జివిఎంసి అధికారులతో కలసి సందర్శించారు.ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ తుఫాన్ తీరం దాటినప్పటికీ ముప్పు తొలగిపోలేదన్నారు. తుఫాను ప్రభావంతో విశాఖలో వర్షాలు అధికంగా కురుస్తున్నందున కొండవాలు, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితిలో పలుచోట్ల పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించి వారికి అన్ని సదుపాయాలు సమకూర్చామని తెలిపారు. పెందుర్తి ఏకలవ్య కాలనీ ముంపు ప్రాంతం అయినందున కాలనీ లోకి వర్షపు నీరు చేరిందని, అక్కడ నివసిస్తున్న 92 మంది ప్రజలను పెందుర్తి జంక్షన్‌లో ఉన్న తాండ్రపాపారాయుడు కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. వారికి వసతితో పాటు ఆహారం, తాగునీరు, మందులు అందించడం జరిగిందని మేయర్ తెలిపారు. ఏకలవ్య కాలనీ నివాసులతో మాట్లాడుతూ పరిస్థితులను బట్టి అత్యవసర పరిస్థితిలో అందరూ పునరావాస కేంద్రాలకురావాలని ఏకలవ్య కాలనీ ప్రజలకు మేయర్ విజ్ఞప్తి చేశారు. పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామలింగేశ్వరరెడ్డి, ఎపిడి చిరంజీవి, ఇతర జివిఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే పరిశీలన



వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి- సీతమ్మధార : మొంథా తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇంటింటా జరుగుతున్న ఫీవర్ సర్వే, వైద్యశిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. జిల్లా మలేరియా సిబ్బందితో కలిసి పెదగంట్యాడ ఆరోగ్యకేంద్రం పరిధిలో ఇంటింటా ఫీవర్ సర్వే పరిశీలించారు. శానిటేషన్, క్లోరినేషన్‌పై సూచనలు చేశారు. బర్మా క్యాంపు ఏరియాలో వైద్యశిబిరాన్ని సందర్శించి అక్కడ అందుతున్న వైద్యసేవలు, అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు.

హెల్త్‌సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశాలు ఇంటింటా సందర్శించి, తుపాన్ ప్రభావంతో ప్రబలే అవకాశమున్న వ్యాధులపై అవగాహన కల్పించి, అప్రమత్తం చేయాలన్నారు. తర్వాత తుపాన్ పునరావాస కేంద్రం, లక్ష్మీనగర్ ఎంపిపి స్కూళ్లను సందర్శించారు. అత్యవసర కేసులుంటే పిహెచ్‌సికి తరలించాలని, గర్భిణులను గుర్తించి, వారిని అవసరమైన వైద్యానికి చర్యలు చేపట్టాలని సూచించారు. డిపిఎంఒ డాక్టర్ బి.ఉమాపతి, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు



నిత్యావసరాలు అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి-ఆనందపురం : మొంథాన్ తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని తర్లువాడ పంచాయతీ నష్టాలపై నివేదిక కోసం తహసీల్దార్ ఎంఆర్.వి. శ్రీనుబాబు బుధవారం సందర్శించారు. పంచాయతీ సర్పంచ్ బిర్లి నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు తాట్రాజు అప్పారావు, జనసేన జిల్లా కార్యదర్శి మజ్జి శ్రీను, బంకు రాజు పాల్గొన్నారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లు, కొట్టుకుపోయిన గెడ్డలు, ముంపు నీటిలో చిక్కుకున్న ప్రాంతాలను పరిశీలించారు. బాధితులకు తహశీల్దార్ శ్రీనుబాబు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున తక్షణ సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ రాంబాబు, జనసేన నాయకులు, వార్డు సభ్యులు కోరాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నిర్వాసితులైన ప్రజలకు 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, పిఎసిఎస్ చైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్ ఆర్థిక సాయంతో పరదేశమ్మ నగర్, సాయిగణేష్ నగర్, నరవ రహదారి పక్కనున్న కాలనీలోని కొంతమంది ప్రజలకు కూరగాయలు, పాలు, తాగునీరు ఆహార ధాన్యాలు అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దాడి రమేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గణబాబు వరద బాధితులకు సహాయ సహకారాలు అందించాలని కోరారని, ఆ మేరకు తమ సొంత నిధులతో కొంతమేర సాయం అందించామన్నారు. అలాగే ప్రభుత్వం తరపున సాయం అందుతుందన్నారు.కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు దాడి సురేష్ భక్తులు శ్రీను సరగడం రవి, ఐతంశెట్టి గోపి, ఇతర నాయకులు పాల్గొన్నారు

సహాయక చర్యల్లో మేము సైతం..

- కొండపైకి విద్యుత్ స్తంభం తరలింపులో సిపిఎం, డివైఎఫ్ఐ కార్యకర్తలు
- స్వచ్ఛంద శ్రమదానంతో కరెంట్ సమస్య పరిష్కారానికి సహకారం
- సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడుతోపాటు పలువురి ప్రశంస



కొండపైకి విద్యుత్‌స్తంభాన్ని చేతులపైనే మోసుకెళుతున్న డివైఎఫ్ఐ, సిపిఎం కార్యకర్తలు, సహకరిస్తున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలో ప్రజాసమస్యల పరిష్కారంలో మేము సైతం అంటూ సిపిఎం, డివైఎఫ్ఐ, ఇతర ప్రజాసంఘాల నేతలు ముందుంటున్నారు. సమస్యలపై ప్రభుత్వం, అధికారులను కదిలించేందుకు ఉద్యమాలు, నిరసనలు చేపట్టడమే కాదు, అవసరమైతే తాము నడుంబిగించి పరిష్కారంలో భాగమౌతున్నారు. జివిఎంసి 63వ వార్డు కొండపైనున్న క్రాంతినగర్‌కు విద్యుత్ స్తంభాన్ని స్వయంగా మోసుకెళ్లి, పాతి విద్యుత్ పునరుదర్ధరణలో భాగమవ్వడం ద్వారా ప్రశంసలు అందుకుని, ప్రజలతో శభాష్ అనిపించుకుంటున్నారు.

జివిఎంసి 63వ వార్డు, క్రాంతినగర్‌లో ఇనుప విద్యుత్తు స్తంభం తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకోగా, ఇప్పటికే ప్రమాద పరిస్థితిని స్థానిక డివైఎఫ్ఐ, సిపిఎం శ్రేణులు అధికారుల దృష్టికి తెచ్చారు. విద్యుత్ సిబ్బంది స్తంభాన్ని తెచ్చినప్పటికీ, కొండపైకి ఎక్కించలేక వదిలేశారు. మంగళవారం వర్షాలు, గాలుల బీభత్సానికి శిథిలమైన ఇనుప విద్యుత్‌స్తంభం ఒరిగిపోయి ఇళ్లపై పడింది. ప్రజల భయాందోళనను గమనించిన సిపిఎం, డివైఎఫ్ఐ కార్యకర్తలు 30మంది బుధవారం అక్కడకు చేరుకుని, అప్పటికే కొండదిగువకు తెచ్చి వదిలేసిన సిమెంట్ విద్యుత్‌స్తంభాన్ని, వర్షంలో సైతం చేతులపై మోసుకెళ్లి కొండపైకి చేర్చారు. వీరి చొరవను గమనించిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తాను కూడా చేయూతనందించి విద్యుత్‌స్తంభాన్ని పైకి చేర్చేందుకు ఊతమిచ్చారు. విరిగిన స్తంభం స్థానే కొత్తది అమర్చేందుకు సహకరించారు. సిపిఎం, డివైఎఫ్ఐ కార్యకర్తల చొరవను జగ్గునాయుడుతోపాటు ఎపిఇపిడిసిఎల్ ఎఇ అభినందించారు.క్రాంతినగర్‌లోనే మరో రెండు విద్యుత్‌స్తంభాలు ప్రమాదరకరంగా ఉన్నాయనిడివైఎఫ్ఐ కార్యకర్తలు చెప్పగానే, వాటిని మార్చేందుకు చర్యలు చేపడతానని ఎఇఇ భరోసానిచ్చారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి వర్షంలో శ్రమదానం చేసిన సిపిఎం, డివైఎఫ్ఐ కార్యకర్తలను స్థానికులు ప్రశంసలతో ముంచెత్తారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ, సిపిఎం నాయకులు ఆర్ సమీన్, ఎం కిరణ్‌కుమార్, ఎస్ వాసు, జి నరేష్, జి దాసు, కె.కోటేశ్వరరావు, సిహెచ్ సురేష్, పి.శ్రీనివాసరావు, కోన నగేష్, ఎస్.రవితేజ, పివి.భాస్కరరావు,ఎన్ శ్రీనివాస రావు, ఎం.ఆదినారాయణ, కె.మురళి, జి .దుర్గాప్రసాద్, ఆర్. నాగేశ్వరరావు, ఎస్ ఏసుబాబు, ఎస్ తాతబుజ్జి, ఎస్ పోలప్పారావు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతంలో ఇసుక బస్తాలతో తాత్కాలిక రహదారి



ఇసుక బస్తాలతో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక రహదారి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి ఆరిలోవ, కొండవాలు ప్రాంతమైన బిసి కాలనీలో ఇసుక బస్తాలతో యుద్ధప్రాతిపదికన తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేసారు. మొంథా తుఫాన్ కారణంగా రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బిసి కాలనీ కొండవాలులో మంగళవారం తెల్లవారు జామున రహదారి ఒక్కసారిగా కుంగిపోయింది. దీనితో కొండపై నివాసాలు ఉంటున్న వారికి రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా పోయింది. ఉన్న ఒకే రహదారి కుంగిపోవడంతో నెలకొన్న తీవ్ర ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ పరిస్థితిని గమనించారు. వెంటనే తాత్కాలికంగా ఇసుక బస్తాలతో రహదారిని ఏర్పాటు చేయాలని జివియంసి అధికారులకు ఆదేశించడంతో, బుధవారం ఇసుక బస్తాలతో రహదారిని ఏర్పాటు చేసారు. దీనితో స్థానికులు హర్షం వ్యక్తం చేసారు.

ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ పునరుద్ధరణ



విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో యంత్రాంగం

ప్రజాశక్తి- సీతమ్మధార.: జివిఎంసి 42వ వార్డు దక్షిణ నియోజకవర్గం రైల్వే న్యూకాలనీ దగ్గర చెట్లు, స్తంభాలు విరిగిపడి, విద్యుత్‌కు అంతరాయం ఏర్పడడంపై స్థానిక కార్పొరేటర్ ఆళ్ల లీలావతి ఆళ్ళ శ్రీను దంపతులు వెంటనే ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో విద్యుత్, జివిఎంసి యంత్రాంగం హుటాహుటిన అక్కడకు చేరుకుని సమస్యను పరిష్కరించి విద్యుత్ పునరుద్ధరించారు. కార్పొరేటర్ ఆళ్ల లీలావతి దంపతులు దగ్గరుండి పనిచేయించారు. సమస్య పరిష్కారంలో చొరవ చూపిన ఎమ్మెల్యే, విద్యుత్ శాఖాధికారులకు లీలావతి ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేటర్ చొరవకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

నారాయణరావుకు నివాళి



నారాయణరావుకు నివాళులర్పిస్తున్న ముత్యాలరావు, తదితరులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎఎంసి చైర్మన్‌గా, ఉడా డైరెక్టర్‌గా, కౌన్సిలర్‌గా పలు పదవులు చేపట్టిన మొకర నారాయణరావు జయంతిని బుధవారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాగవంశ సంక్షేమ సంఘం అధ్యక్షులు కె ముత్యాలరావు, ఎస్ జోగారావు, చిలకా రమణ, కుటుంబ సభ్యులు కెఎస్ఆర్ కృష్ణారావు, కనకల సన్యాసినాయుడు పాల్గొన్నారు

విద్యుత్ సహాయక చర్యలపై సమీక్ష



మాట్లాడుతున్న ఎపిఇపిడిసిఎల్ సిఎండి శివశంకర్

ప్రజాశక్తి- సీతమ్మధార : మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యల్లో భాగంగా తిరుపతి నుంచి ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి లోతేటి శివశంకర్ బుధవారం ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయానికి విచ్చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ కార్యక్రమాలను ఇపిడిసిఎల్ సిఎండి ఇమ్మడి పృథ్వీతేజ్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో, కార్పొరేట్ కార్యాలయం నుండి అవసరమైన సమన్వయ సహకారం అందించేందుకు చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ ఆదేశాల మేరకు శివశంకర్ విశాఖపట్నం చేరుకున్నారు. ఇప్పటికే ఎపిఎస్‌పిడిసిఎల్ నుంచి సుమారు 1,500 మంది అధికారులు, సిబ్బంది తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. సిఎండి శివశంకర్, ఎపిఇపిడిసిఎల్ డైరెక్టర్లు డి. చంద్రం, టి. వనజ, సిజిఎం వి.విజయలలిత, ఎస్ఈ సురేఖ తదితరులతో సమావేశమై క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన మెటీరియల్ సరఫరా, మద్దతు చర్యలపై సమీక్షించారు

కల్వర్టులో వ్యర్థాల తొలగింపు



కల్వర్టులోని వ్యర్థాలను తొలగిస్తున్న ప్రొక్లెయినర్



నీటి ముంపులో కాలనీ

ప్రజాశక్తి-ములగాడ : జివిఎంసి 40వ వార్డు పోలీస్‌స్టేషన్ కల్వర్టులో పేరుకుపోయిన వ్యర్థాలను బుధవారం స్థానిక వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరరావు పర్యవేక్షణలో తొలగించారు. మొంథా తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పైనుంచి భారీ ఎత్తున వర్షపునీరుతోపాటు ప్లాస్టిక్ ఇతరత్రా వ్యర్థాలు వచ్చి కల్వర్టులో పేరుకుపోవడంతో ఎకెసి కాలనీ, రాజీవ్ కాలనీలు మురుగుతోకూడిన వరద నీటితో మునిగిపోయిన విషయం తెలిసిందే. కల్వర్టులో వ్యర్థాలు పేరుకుపోయి, నీరు మళ్లే వీలు లేకపోవడంతో రోడ్డు ముంపు బారిన పడడంతో డివైడర్‌కు కోతపెట్టారు. దీంతో మల్కాపురం పోలీసుస్టేషన్, టెలిఫోన్ ఎక్చేంజీల్లోకి నీరు చొరబడింది. దీంతో రాజీవ్‌కాలనీ, పోలీస్‌స్టేషన్‌కు మధ్యనున్న గోడ విరిగిపోవడంతో వరద నీరంతా కాలనీలోకి చొరబడి విలయం సృష్టించింది. వర్షం తగ్గుముఖం పట్టిన తర్వాత కల్వర్టులో పేరుకుపోయిన వ్యర్థాలను ప్రొక్లెయినర్‌తో తొలగించారు. దీంతో తాత్కాలికంగా సమస్య పరిష్కారమైంది.

కల్వర్టు పునర్నిర్మాణంతోనే శాశ్వత పరిష్కారం

40వ వార్డు పోలీస్‌స్టేషన్ కల్వర్టు వద్ద నెలకొన్న పరిస్థితులతో వర్షం కురిసినప్పుడల్లా ముంపు సమస్య తలెత్తుతుండడంతో దీనికి శాశ్వత పరిష్కారంగా ప్రస్తుతమున్న చిన్న కల్వర్టును తొలగించి, దాని స్థానే భారీ కల్వర్టులను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పలుమార్లు జివిఎంసి కౌన్సిల్‌లో ప్రస్తావించి, చర్చించామని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికైనా ఇక్కడ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

ఆలయాలకు కొత్త కమిటీలు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం గ్రామంలోని పార్వతీ సమేత నారాయణేశ్వరస్వామి దేవస్థానానికి కొత్త కమిటీని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాలతో నియమించారు. ఆలయ కమిటీ అధ్యక్షులుగా కుప్ప రామలక్ష్మి, ప్రచార కార్యదర్శిగా కుప్ప సంతోష్, ఉపాధ్యక్షుడుగాలంకలపల్లి నరసింహమూర్తి, కార్యదర్శిగా: కుప్ప పోతయ్య, జాయింట్ సెక్రటరీలుగా లంకలపల్లి సంతోష్, ముడసల శ్రీను, కోశాధికారిగా ఇమంది వెంకట శ్రీనివాసరావు, సహాయ కోశాధికారులుగా లంకలపల్లి సాయి చంద్ర ప్రసాద్, పుట్ట నానాజీ, ఆర్గనైజర్లుగా మేడిశెట్టి గౌరీశంకర్, బుర్ల గౌరీశంకర్‌లను నియమించారు.నూతన కమిటీ సభ్యులను దుశ్శాలువాలతో సత్కరించి, అభినందించారు. భక్తుల సేవలో నిబద్ధతతో పనిచేయాలని, దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే గంటా సూచించారు.

దుర్గాభవాని ఆలయానికి నూతన కమిటీ

ఆనందపురం : గ్రామంలోని ఎస్‌సి, బిసి కాలనీలోని దుర్గాభవాని ఆలయానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతన పాలకవర్గాన్ని నియమించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులుగా లంకలపల్లి గిరిజ, అధ్యక్షులుగా కొట్యాడ లక్ష్మణమూర్తి, ఉపాధ్యక్షులు లంకలపల్లి కనకాచారి, కార్యదర్శిగా మజ్జి అప్పలరాజు, సహాయ కార్యదర్శిగా కోన చందు, కోశాధికారిగా లంకలపల్లి అప్పలరాజు, సహాయ కోశాధికార్లుగా కుప్ప గౌరి, ముడసల దుర్గారావు, ఆర్గనైజర్‌గా తాడ్డి ఈశ్వరరావు, కర్రి అచ్చిబాబు ఎన్నికయ్యారు ఎన్నికైన సభ్యులను గంట శ్రీనివాసరావు అభినందించారు ఆలయాభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే గంటా సూచించారు.

నిండు కుండలా ముడసర్లోవ రిజర్వాయర్

ప్రజాశక్తి - ఆరిలోవ : మొంథా తుఫాన్ కారణంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నగర పరిధిలోని ముడసర్లోవ రిజర్వాయర్‌కు జలకళ సంతరించుకుని, నిండు కుండలా కనిపిస్తుంది. రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం 170 అడుగులు కాగా, బుధవారం ఉదయానికి 165 అడుగులకు నీరు చేరింది. మరో ఐదు అడుగులకు చేరితే ఓవర్ ఫ్లో అయ్యే అవకాశాలు ఉన్నాయి. గతంలో 2023లో రిజర్వాయర్ పూర్తిగా నిండిపోయి ఓవర్ ఫ్లో అయిన సందర్భం ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇలాంటి పరిస్థితి రాలేదు. మళ్ళీ ఈ ఏడాది రిజర్వాయర్ ఓవర్ ఫ్లో అయ్యే అవకాశాలు ఉన్నాయని వాటర్ విభాగం అధికారులు అంటున్నారు. చుట్టూ పచ్చని కొండలూ, మధ్యలో నిండు కుండలా ఉన్న జలాశయాన్ని చూసేందుకు ఆహ్లాదకరంగా ఉందని స్థానికులు అంటున్నారు.

ముంచేసిన మొంథా

- తుపాన్ దెబ్బకు అపార నష్టం
- వెయ్యి హెక్టార్లకు పైగా దెబ్బతిన్న వరి పంట
- విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం
- పలు చోట్ల పశువులు మృతి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్, అనకాపల్లి

మొంథా తుఫాన్ ప్రభావం అనకాపల్లి జిల్లాపై తీవ్రంగా పడింది. జిల్లాలోని పలు మండలాల్లో వర్షాలు, గాలులు తీవ్ర ప్రభావం చూపడంతో నష్టం భారీగా సంభవించింది. వ్యవసాయం, గృహాలు, రోడ్లు, విద్యుత్ వ్యవస్థలకు గణనీయ నష్టం కలిగింది. ప్రభుత్వ అధికారులు ఇప్పటి వరకు లెక్కలు ప్రకటించినా ఇంకా ఎక్కువే నష్టం ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తుఫాన్ తీవ్రతతో పడిన వర్షాలకు 1,017.79 హెక్టార్ల వరి పంట దెబ్బతిన్నట్లు ఇప్పటివరకు అధికారిక లెక్కలు. అత్యధికంగా అనకాపల్లి మండలంలో 570.4 హెక్టార్లు పంటకు నష్టం కలిగింది. సబ్బవరం మండలంలో 32.5 హెక్టార్లు, కశింకోటలో 65, మునగపాకలో 57.5, బుచ్చయ్యపేటలో 116.4, ఎస్.రాయవరంలో 40, దేవరాపల్లి 16.99, కె.కోటపాడు 12, చీడికాడ 3.2, చోడవరం 7.6, గొలుగొండ 5, నర్సీపట్నం 7.2, నాతవరం 10, అచ్యుతాపురం మండలంలో 4 హెక్టార్లలో వరి పంట నష్టం జరిగింది. పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామంలో 4.8 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో 160 ఇళ్లు దెబ్బతిన్నాయి. వీటిలో పక్కా ఇళ్లు 49, కచ్చా ఇళ్లు 111 ఉన్నాయి. అనకాపల్లి, సబ్బవరం, మునగపాక, ఎస్.రాయవరం మండలాల్లో ఎక్కువ ఇళ్లకు నష్టం వాటిల్లినట్టు సమాచారం. పలు చోట్ల 9 పశువులు మృతి చెందాయి. ఎస్.రాయవరం మండలంలో 2 ఆవులు, మాడుగులలో 1 ఆవు, దేవరాపల్లిలో 2 గేదెలు, నక్కపల్లిలో 2 దూడలు, రాంబిల్లిలో 1, అచ్యుతాపురంలో 1 గొర్రె చనిపోయాయి.

కాలువలు చెరువులు మరమ్మతులకు గురయ్యాయి. కసింకోట మండలం తేగాడ గ్రామంలో శారద నది వరద గట్టు, ఎస్.రాయవరం సోమదేవుపల్లి వరాహనది వరద గట్టు, నక్కపల్లి మండలం పరగణం చెరువు, మాడుగుల మండలం తాటిపర్తి ఎన్టీఆర్ రిజర్వాయర్ కల్వర్టు, అప్రోచ్ రోడ్డు, సబ్బవరం మండలం అంతకాపల్లి అప్పలరాజు చెరువు దెబ్బతిన్నాయి. ఆర్ అండ్ బికి చెందిన ఎనిమిది మండలాల్లో 14 రోడ్లు 42 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. మునగపాక మండలం కొండకర్ల నుంచి గణపతి వెళ్లే రోడ్డు, చీడికాడ మండలం జి కొత్తపల్లి గ్రామంలో కల్వర్టు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. అనకాపల్లిలో 16, ఎలమంచిలిలో 10, నక్కపల్లిలో 3, పరవాడ, అచ్యుతాపురం, బుచ్చయ్యపేటలో మూడు చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సంస్థకు నష్టం వాటిల్లింది. 31 ఫీడర్లు, 83 విద్యుత్ స్తంభాలు, 2.98 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు, 32 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినగా 14,609 సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరణ పనులు వేగంగా చేస్తున్నారు. అటు నీటి సరఫరా పథకాలకు కూడా అంతరాయం కలిగింది. సబ్బవరం మండలంలోని సిపిడబ్ల్యుఎస్ పథకం మేఘాద్రి గెడ్డ వరద నీటి ప్రభావంతో కొంత దెబ్బతింది. అధికారులు నీటి సరఫరా పునరుద్ధరణ పనులు వేగంగా చేపట్టారు. నష్టం అంచనా పక్కగా చేసి బాధితులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.



కశింకోట : మునిగిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా



శారద నదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నది

ప్రజాశక్తి-అనకాపల్లి : మొంథా తుఫాన్ వల్ల అధిక వర్షం కురవడంతో రైవాడ, పెద్దేరు జలాశయాల నుండి అధిక మొత్తంలో నీటిని విడుదల చేస్తుండడంతో శారదా నది ప్రవాహ పరిస్థితి ఉధృతంగా ఉంది. తగరంపూడి, సీతానగరం, వెంకుపాలెం గ్రామస్తులు నది పరివాహ ప్రాంతాలకు వెళ్ళొద్దని, నదులు పక్కన ఉన్న పంట పొలాలకు పశువుల పాకల వద్దకు వెళ్లవద్దని, వరద ప్రవాహం మరో రెండు రోజులపాటు ఉంటుందని, జాగ్రత్తగా ఉండమని పోలీసులు తెలియజేశారు. శారదా నది వరద ఉధృతి సమాచారాన్ని గ్రామస్తులకు దండోరా, మైకుల ద్వారా తెలియపరిచారు. అలాగే వెంకుపాలెం నుంచి కుంచంగి వెళ్లే వెదుళ్ల గడ్డ రోడ్డుపై ప్రవహిస్తుండడంతో వెంకుపాలెం, కుంచంగి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నీటి ప్రవాహానికి ఇరు వైపులా పోలీస్ సిబ్బందిని పెట్టి వాహనాలు, ప్రజలు రాకపోకలను నిలుపుదల చేశారు.

రావణాపల్లి రిజర్వాయర్‌కు గండి



గొలుగొండ : రిజర్వాయర్ గండిని పూడ్చుతున్న దృశ్యం

ప్రజాశక్తి-గొలుగొండ : మొంథా తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు గొలుగొండ మండలం రావణాపల్లి రిజర్వాయర్‌కు సంబంధించి కొమిర గ్రామంకు వైపు ఆనుకొని ఉన్న ప్రాంతంలో గండి పడింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ రామారావు, ఇరిగేషన్ అధికారులు తక్షణమే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం గండిపడిన ప్రాంతాన్ని రైతులు, సిబ్బందితో కలిసి పూడ్చివేయించారు.

ఏడాది క్రితమే హెచ్చరించిన ప్రజాశక్తి

రిజర్వాయర్ గర్భంలో అధికారికంగా అనుమతులు లేకపోయినా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం కారణంగా రిజర్వాయర్‌కు గండి ఏర్పడే ప్రమాదం ఉందని ఏడాది క్రితమే ప్రజాశక్తి దినపత్రిక హెచ్చరించింది. అయినా ఇరిగేషన్ అధికారులు ౹ కొంతమందితో ఏర్పడ్డ బేరసారాల కారణంగా రిజర్వాయర్ గర్భంలోని ఫెన్సింగ్‌ని తొలగించలేదు. రిజర్వాయర్ గర్భంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన ప్రాంతమంతా పూడిక ఏర్పడింది. ఈ విషయంపై గత ఏడాది ఇరిగేషన్ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. మత్స్యకారులతో ఏర్పాటు చేసుకున్న అనధికారక ఒప్పందం మేరకు అధికారులు ఈ ఫెన్సింగ్‌ని తొలగించలేదు. రైతాంగానికి ఉపయోగపడాల్సిన రిజర్వాయర్‌కు ముప్పు ఏర్పడుతుందని తెలిసినా అధికారుల్లో స్పందన లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి రిజర్వాయర్ గర్భంలోని ఫెన్సింగ్‌ని తొలగించాలని రైతులు కోరారు.

పలు చోట్ల నేలకూలిన చెట్లు

అనకాపల్లి, అనకాపల్లి రూరల్ : అనకాపల్లి నూకాలమ్మ తల్లి ఆర్చి, ఇండియన్ పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారి -16పై బుధవారం తెల్లవారుజామున భారీ వృక్షం నేలకూలింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న అనకాపల్లి టౌన్ సిఐ ప్రేమ్ కుమార్, ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, జీవీఎంసీ జేసీబీలు సహకారంతో సంఘటన స్థలానికి చేరుకుని, సుమారు రెండు గంటల పాటు శ్రమించి వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

యలమంచిలి టౌన్ : పట్టణంలోని టిడ్కో గృహ సముదాయం దగ్గర్లో జాతీయ రహదారి-16పై తుపాన్ ప్రభావంతో చెట్లు కూలిపోయాయి. అధికారులు వెంటనే స్పందించి వాటిని తొలగించినట్లు మున్సిపల్ ఏఇ నానాజీ తెలిపారు.


కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ -వెంకన్నపాలెం రోడ్డులో మద్దాల వారి కల్లాల వద్ద భారీ చెట్టు కూలి ఎల్‌టి విద్యుత్ లైన్‌పై పడింది. దీంతో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ ఏఈ చంద్రశేఖర్ తన సిబ్బందితో హటాహుటిన వచ్చి చెట్ల కొమ్మలు తొలగించి విద్యుత్తును పునరుద్ధరించారు. కె.కోటపాడు- పెందుర్తి రోడ్డు పెట్రోల్ బంకు వద్ద రోడ్డుకు ఇరుపక్కల చెట్లు పడిపోవడంతో విశాఖపట్నం నుండి వచ్చిన ఆర్టీసీ బస్సులు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం కలిగింది. పంచాయతీ అధికారులు అక్కడికి చేరుకుని చెట్లను తొలగించారు. భారీ వర్షాలకు చంద్రయ్యపేట వద్ద కల్వర్టు ధ్వంసమైంది.

పాయకరావుపేట : తుఫాను ప్రభావంతో మంగళవారం రాత్రి వీచిన పెను గాలులకు పట్టణంలోని మంగవరం రోడ్డులో గల జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్లో భారీ వృక్షం నేల కూలింది. విషయం తెలుసుకున్న అధికారులు బుధవారం ఉదయమే పాఠశాల వద్దకు చేరుకొని చెట్టును తొలగించారు. కార్యక్రమంలో ఎస్ఐ పురుషోత్తం, ఇఓపిఆర్డీ డేవిడ్, ఎంఇఓ రమేష్ బాబు, పంచాయతీ రాజ్ ఎఇ కచేరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లోకి వరద నీరు

పరవాడ : పరవాడ టిడ్కో కాలనీలోని ఇళ్లలోకి వరదనీరు చొరబడడంతో కాలనీవాసులు రాత్రంతా నిద్రలేక ఇబ్బంది పడ్డారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానిక ఐద్వా నాయకులు అన్నపూర్ణ, బంగారం బుధవారం కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

విద్యుత్ అంతరాయం



అనకాపల్లి : జాతీయ రహదారిపై చెట్టును తొలగిస్తున్న దృశ్యం

బుచ్చయ్యపేట : తుఫాన్ నేపథ్యంలో మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, చిన్నప్పన్నపాలెం, పోలేపల్లి, పి.భీమవరం తదితర గ్రామాల్లో విద్యుత్ లైన్లు మరమ్మతులకు గురై బుధవారం ఉదయం నుండి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పలు గ్రామాల్లో వివాహ కార్యక్రమాలు ఉండటంతో విద్యుత్ సరఫరా లేక పెండ్లి మండపాలు వెలవెలబోయాయి. మంచి నీటి పథకాలు పని చేయక నీటి కోసం ఇబ్బంది పడ్డారు.

కూలిన పూరిల్లు గోడలు

రోలుగుంట : తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ వీధిలో గెంజి అప్పలనాయుడు పూరిల్లు గోడలు బుధవారం కూలి పోయాయి. సమాచారం అందుకున్న పంచాయతీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబానికి అర్హత మేరకు సహాయ చర్యలు తీసుకునేందుకు చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దెబ్బతిన్న పాఠశాలలు

అనకాపల్లి : మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో పలు మండలాల్లో పాఠశాలలు, పాఠశాలల ప్రహరీ గోడలు దెబ్బతిన్నాయి. అనకాపల్లి మండలంలో 22, కసింకోట మండలం ఒకటి, బుచ్చయ్యపేట ఒకటి, దేవరాపల్లి రెండు, గొలుగొండ రెండు, కె కోటపాడు ఒకటి, మునగపాక 14, నర్సీపట్నం ఒకటి, నాతవరం నాలుగు, పాయకరావుపేట 2, రోలుగుంట 8, సబ్బవరం 1, ఎస్ రాయవరం 13, వి.మాడుగుల ఆరు పాఠశాలలు దెబ్బతిన్నాయి.

ఎడతెరిపి లేని వర్షం

బుచ్చయ్యపేట : తుఫాన్ ప్రభావంతో బుధవాచం ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. మంగళవారం రాత్రి నుండి కురుస్తున్న వర్షాలకు చెరువుల్లో భారీగా నీరు చేరడంతో ప్రమాద స్థాయికి చేరుకున్నాయి. మండలంలోని దిబ్బిడి రావిబంధ, జగ్గరాజు చెరువు, కొత్తచెరువు, వంక చెరువు తదితర చెరువుల్లో నీరు అధికంగా ఉండడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువులకు మధుముల, పొర్లుకట్టులు మరమ్మత్తుల గురి కావడంతో నీరు పారి పొలాల్లోకి చేరింది. పలు గ్రామాల్లో వరి పంటలో నీరు అధికంగా చేరింది. అధికారులు ప్రజాప్రతినిధులు చెరువులను పరిశీలించారు.

కోటవురట్ల : మండల వ్యాప్తంగా బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వర్షంతో పాటు గాలులు కూడా వీయడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మునిగిన పంట పొలాలు, దెబ్బతిన్న ఇళ్లను అధికారులు పరిశీలించారు. విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలు బోసిపోయాయి, పలు ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు.



రైవాడ రిజర్వాయర్ నుండి విడుదల చేస్తున్న వరద నీరు

రైవాడ జలాశయం నుండి వరదనీటి విడుదల

ప్రజాశక్తి-అనకాపల్లి, దేవరాపల్లి : దేవరాపల్లి మండలంలోని రైవాడ జలాశయం నుండి వరద నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. జలాశయంలో గరిష్ట నీటి మట్టం 114.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 112.97 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం జలాశయానికి వరద నీటి ప్రవాహం (ఇన్‌ఫ్లో) సుమారు 12,000 క్యూసెక్కులు వస్తుండడంతో మూడు గేట్లు తెరచి సుమారు 12,000 క్యూసెక్కుల నీటిని శారదా నదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శారదా నది పరివాహక ప్రాంతంలో గ్రామాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా, దేవరాపల్లి ఎస్ఐ వి.సత్యనారాయణ వేర్వేరు ప్రకటనల్లో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తామరబ్బ-సమ్మెద మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను బుధవారం దేవరాపల్లి ఎస్సై తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. బ్రిడ్జ్‌పై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

నేడు విద్యా సంస్థలకు సెలవు

ప్రజాశక్తి-అనకాపల్లి : బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను ప్రభావంతో అనకాపల్లి జిల్లాలో భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని అక్టోబర్ 30వ తేదీ గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ తదితర విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించి ఏ పాఠశాలయినా తెరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. తుఫాన్ తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే మాత్రమే బయటకు వెళ్లాలని ఆమె సూచించారు.

రిజర్వాయర్లకు భారీగా వరద నీరు

ప్రజాశక్తి-అనకాపల్లి : మొంథా తుఫాను నేపథ్యంలో రిజర్వాయర్లకు భారీగా నీరు చేరింది. తాండవ రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 380 అడుగులు కాగా 377.20 అడుగులకు చేరింది. రైవాడ గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా 112.92 మీటర్లకు, కోణం రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 101.25 మీటర్లకు 98.80 మట్టాన్ని చేరింది. పెద్దేరు రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా 135.30 మీటర్లకు, వరాహ రిజర్వాయర్ 460 అడుగుల గరిష్ట నీటిమట్టానికి గాను 458.30 అడుగులకు నీరు చేరింది.

పంటలకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : మొంథా తుపాను నేపథ్యంలో వివిధ పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలను వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు వివరిస్తున్నారు. ఉత్తర కోస్తా జిల్లాల్లో తుఫాను వల్ల ఈదురు గాలులతో కూడిన అధిక వర్షాలు వల్ల జరిగే వరి పంట నష్టాన్ని తగ్గించుకునేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ పూతదశలో తాలు గింజలు ఏర్పడే అవకాశం ఉన్నందున ధాన్యం రంగు మారకుండా, మాని పండు, మాగుడు, ఆకుముడత, ఎండాకు, దోమపోటు నివారణకు ఎకరాకు 200 మిల్లీలీటర్ల ప్రొపి కొనజోల్ పిచికారి చేసుకోవాలన్నారు. గింజ గట్టి పడే దశలో అధిక వర్షాలకు గురైతే పడిపోయే పరిస్థితుల్లో వచ్చే అవకాశం ఉందని దీని నివారణకు ఐదు శాతం ఉప్పు ద్రావణం కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. పూతదశలో తెగుళ్ల నివారణకు బ్యాక్టీరియా ఎండకు తెగులు నివారణకు ప్లాంటోమైసిన్ ఒక మిల్లీలీటర్, కాపర్ హైడ్రాక్సైడ్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మాగుడు, తెగులు నివారణకు నీరు తగ్గిన తర్వాత హెక్సా కొనజోల్ 400 మిల్లీమీటర్లు మాని పండు, మాగుడు తెగులు నివారణ ఎకరాకు లేదా 200 మిల్లీలీటర్లు ప్రొపి కొనజోల్ పిచికారి చేసుకోవాలని కోరారు. ఆకు ముడత నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు లేదా క్లోరాన్ట్రినిప్రోల్ 60 మిల్లి లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. దోమపోటు, మాగుడు తెగులు, మానిపండు తెగులు నివారణకు ఎకరాకి ప్రొపి కొనజోల్ 200 మిల్లీలీటర్లు, పై మెట్రో జాన్ 120 గ్రాములు లేదా ప్రొపి కొనజోల్ 200, 96 మిల్లీలీటర్ల ట్రెప్ల మెజో ఫైరం 10 ఎస్సీ పిచికారి చేయాలన్నారు. చెరుకు పంట లో మురుగునీటిని తీసివేసి ఎకరాకు బూస్టర్ డోస్ యూరియా 25 కిలోలు, 25 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న నరసింగరావు

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో నరసింగరావుకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ జిల్లా యోగా అసోసియేషన్, ఎపి యోగ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన 38వ రాష్ట్ర యోగాసన ఛాంపియన్షిప్ 2025లో అనకాపల్లి జిల్లా తుమ్మపాల గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యోగ సెంటర్ టీచర్ బుదిరెడ్డి నరసింగరావు 60 సంవత్సరాల పైబడిన విభాగంలో ప్రథమ స్థానం దక్కించుకున్నారు. విజయ సాయి యోగ చారిటబుల్ ట్రస్ట్, ఓం ప్రీ యోగ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో శ్రీకృష్ణ యోగ సెంటర్ నుంచి 8 నుంచి 14 సంవత్సరాల విభాగంలో పాల్గొన్న బి దేవాన్షినాయుడు ద్వితీయ స్థానం, బి జయశ్రీ తృతీయ స్థానం, 18 నుంచి 24 సంవత్సరాల విభాగంలో తేజస్విని ఆరో స్థానం సంపాదించారు.

ఆక్రమణదారుల దౌర్జన్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పోలేపల్లి భూ ఆక్రమణలకు అడ్డుపడుతున్నారన్న కారణంతో ఆక్రమణదారులు గ్రామస్తులపై దౌర్జన్యానికి దిగడంపై బుధవారం స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులు తమ ఇళ్ళ మీదకు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేనెంబర్ 156లో 216 ఎకరాల భూమి ఉండగా, కొంతమంది ఆ భూమిని యంత్రాలతో చదును చేయించి ఆక్రమించి మొక్కలు నాటారు. ఈ భూ ఆక్రమణలపై ఫిర్యాదు చేయడంతో అధికారులు ఇటీవల మొక్కలు తొలగించి ఆ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో ఆక్రమణ దారులు తమపై దౌర్జన్యాలకు దిగుతున్నారని సర్పంచ్ సీత పైడనాయుడు, మర్లోతు చిన్న అప్పలనాయుడు, సీత ఈశ్వరరావు, సీత వెంకట శ్రీరామ్మూర్తి, తదితరులు వాపోయారు. దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గంజిపేటకు చెందిన గుర్రం చంద్రశేఖర్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.38వేలు చెక్కును స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ బుధవారం అందజేశారు. చంద్రశేఖర్‌కు కొద్ది కాలం క్రితం జరిగిన ప్రమాదంలో కాలు విరిగిపోయాయి. ఈ విషయాన్ని స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయం మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎర్ర కోటేశ్వరరావు, బొండా రమణ, దాసరి రామారావు, గుర్రం నాయుడు, రౌతు వరాహ నరసింహమూర్తి, గంజి రాజు, దామురోతి అర్జున్, తురసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలో అడ్డురోడ్డు మేజర్ పంచాయతీ అయ్యప్ప సేవా సంఘం తరపున మాలధారణ చేసిన భక్తులకు బుధవారం అన్నప్రసాదం నిర్వహించారు. ఈ సందర్భంగా కొరుప్రోలు పిఎసిఎస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమన్ని మొదలు పెట్టి 10 సంవత్సరాలు పూర్తయినట్లు తెలిపారు. మొట్టమొదటి సారి 2015లో ఈ కార్యక్రమం నిర్వహించినప్పటి నుండి రోజుకు 300మంది చొప్పున మాలధారణ చేసిన భక్తులకు అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు అప్పల శివ, బద్దిరెడ్డి లోవరాజు, పృధ్వీ, సూర్యం, అశోక్, వాసు, సత్తిబాబు పాల్గొన్నారు.



అయ్యప్ప చిత్ర పటాన్ని అందజేస్తున్న దృశ్యం

తుపాన్ బాధితులకు ఝాన్సీ సహాయం



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తో మాట్లాడుతున్న కర్రి ఝాన్సీ

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి మున్సిపాలిటీ సోమలింగపాలెం గ్రామంలో తుపాన్ ప్రభావంతో నిరాశ్రయులైన సుమారు 15 మందిని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ సూచనలు మేరకు బాధితులకు జనసేన నాయకులు కర్రి ఝాన్సీ భోజనాలు ఏర్పాటు చేశారు. అలాగే నిత్యావసర సరుకులను తహశీల్దారు వరహాలు చేతుల మీదుగా అందజేశారు. సోమలింగపాలెంలో చెట్టు పడిపోయి విద్యుత్ అంతరాయం కలగడంతో తాగునీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ఝాన్సీ మున్సిపాల్ కమిషనర్‌తో మాట్లాడి ట్యాంకురు ద్వారా తాగునీటిని అందించారు.

అల్పాహారం పంపిణీ

పాయకరావుపేట : పాయకరావుపేట పట్టణంలోని పాండురంగ స్వామి దేవస్థానం వెనక గల చాకల వీధి, తోకలవారి వీధి ప్రాంతంలో తుపాను బాధితులకు టిడిపి పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాలబాబు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెదిరెడ్డి శ్రీను, పల్లా విలియం కేరి, మజ్జూరి నారాయణరావు, జూరెడ్డి ప్రసాద్, గొల్లపల్లి నాగు, వేములపూడి అప్పారావు పాల్గొన్నారు.

భోజనాలు పంపిణీ

యలమంచిలి టౌన్ : మండలంలోని కృష్ణాపురం పునరావాస కేంద్రం బాధితులకు జనసేన నాయకులు కొలగాని భాస్కర్ ఫలహారం, భోజనాలు అందించారు. ఆశ కార్యకర్తలతో మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడే పుస్తక మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ స్టేడియం అల్లూరి సీతారామరాజు ప్రాంగణంలో 1వ అనకాపల్లి పుస్తక మహోత్సవాన్ని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా గురువారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశిష్ట అతిథులుగా కలెక్టర్ విజయకృష్ణన్, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్ల సాంబశివరావు, శారద గ్రంథాలయ అధ్యక్షులు కొరుకొండ బుచ్చిరాజు హాజరవుతున్నారని పేర్కొన్నారు. అక్టోబర్ 30 నుండి నవంబర్ 5 వరకు జరిగే ఈ పుస్తక మహోత్సవంలో వంద ప్రచురణ సంస్థలకు చెందిన పుస్తకాలు 100 స్టాల్స్‌లో ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు కవి సమ్మేళనాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పుస్తక అభిమానులు, కళాభిమానులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలం సూరెడ్డిపాలెం గ్రామంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సిపిఎం మండల నాయకులు వనము సూర్యనారాయణ, ఈర్ల నాయుడు బాబు డిమాండ్ చేశారు. గ్రామానికి అనుకొని ఉన్న రియల్ ఎస్టేట్ యజమానులు పెద్ద పెద్ద గోతులు తవ్వి వదిలేశారని, నాలుగు నెలల నుండి ఆ గోతుల్లో నీరు చేరి చుట్టు పక్కల దోమల బెడద ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దోమల బారిన పడి ప్రజలకు మలేరియా డెంగ్ ఇతర అంటూ వ్యాధులు సోకడానికి అవకాశం ఉందని, అందువలన గ్రామ ప్రజ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ గోతుల్లో నీరు నిల్వ లేకుండా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూరెడ్డి రామ్మూర్తి, గణేష్, దిక్కోలు లక్ష్మి, నారాయణమ్మ, ఈర్లే రామయ్య, చిన్న రామయ్యమ్మ, తెగినాన నారాయణమ్మ, గోపాల్, వేమన లక్ష్మి, లలిత పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో బస్సు షెల్టర్ నిర్మించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి బైపాస్ రోడ్డు వద్ద దూర ప్రయాణికులు ఇబ్బందుల దృష్ట్యా తక్షణమే అక్కడ బస్ షెల్టర్‌ను నిర్మించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బైపాస్ రోడ్‌లో నాగభూషణం ఆధ్వర్యంలో ఫ్లెక్సీ, ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, ఊడా నాగేశ్వరరావు, నందేల అప్పారావు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై పశుగ్రాసం పంపిణీ

ప్రజాశక్తి-పాయకరావుపేట : తుఫాన్ బాధిత ప్రాంతాల రైతులకు సబ్సిడీపై పశుగ్రాసం టిడిపి మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్ చేతుల మీదుగా పెదరామభద్రపురం రైతు సేవా కేంద్రంలో బుధవారం పంపిణీ చేశారు. పెంటకోట, పాల్మన్ పేట, రాజవరం, వెంకటనగరం, పెద్దూరు తీర ప్రాంత రైతులకు కూడా పశు గ్రాసం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య అధికారులు, టిడిపి నాయకులు కలిగట్ల శ్రీను పాల్గొన్నారు.

కుళాయిల ద్వారా బురదనీరు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : గత నాలుగు రోజులగా కురుస్తున్న వర్షాలు కారణంగా మంచినీటి పథకాల ద్వారా తాగునీరు బురదగా వస్తుంది. దీంతో ప్రజలు ఈ నీటిని తాగడానికి ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి శివారు గ్రామమైన నేతవానిపాలెం గ్రామంలో మంచినీటి పథకం ద్వారా బుధవారం వచ్చిన నీరు ఎర్రగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

పునరావాస కేంద్రాల్లో బాధితులు

ప్రజాశక్తి-అనకాపల్లి : మొంథా తుపాను నేపథ్యంలో జిల్లాలో పలు మండలాల్లో పునరావాస కేంద్రాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. అచ్యుతాపురం, రాంబిల్లి, పరవాడ, నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్ రాయవరం మండలాల్లో 28 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం 1446 మంది ఉన్నారు. ఫ్లడ్ ప్రోన్ మండలాలైన మునగపాక, అనకాపల్లి, చోడవరం, కసింకోట, బుచ్చయ్యపేట, ఎలమంచిలి, కే కోటపాడు, మాకవరపాలెం, నర్సీపట్నం, సబ్బవరం మండలాల్లో 19 కేంద్రాలు ఏర్పాటు చేయగా వీటిలో 672 మంది, గిరిజన మండలాలైన చీడికాడ, రావికమతం, కోటవురట్ల, మాడుగుల, గొలుగొండ, దేవరపల్లి, నాతవరం, రోలుగుంట మండలాల్లో 29 పునరావాస కేంద్రాల్లో 3902 మంది ఆశ్రయం పొందారు.

గెడ్డలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రమాదవశాత్తు గెడ్డలో పడి ఓ యువకుడు గల్లంతైన సంఘటన మండలంలోని చౌడువాడ శివారు బంటువారి కల్లాలు సమీపంలోని చోటుచేసుకుంది. బంటువారి కల్లాలు వద్ద గల చిట్టిగెడ్డలో మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో పశువులు కాసేందుకు వెళ్లిన బంటు అప్పలనాయుడు (32) ఆచూకీ లభ్యం కాలేదు. పశువులు కల్లానికి వచ్చినప్పటికీ తన కుమారుడు రాకపోవడంతో తల్లి బంటు గౌరమ్మ పొలాల పరిసరాల్లో కుమారుని కోసం వెతికింది. బంధువులు, గ్రామస్తులు వచ్చి గెడ్డ సమీపంలో వెతికినా అప్పలనాయుడు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కె.కోటపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై ధనుంజయ్ ఆధ్వర్యంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు చిట్టిగెడ్డ పరివాహక ప్రాంతం గాలించారు. కాని బుధవారం సాయంత్రం వరకు అప్పలనాయుడు ఆచూకీ తెలియరాలేదు. గురువారం ఉదయం గాలింపు చర్యలు చేస్తామని ఎస్సై ధనుంజయ్ తెలిపారు. సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పంచాయతీ కార్యదర్శి పాలూరి సురేష్ బాబు, గ్రామ పెద్దలు సహాయ సహకారాలు అందిస్తున్నారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

మట్టి పాత్రల తయారీపై శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలో జాజులవానిపాలెంలో ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి) ఆధ్వర్యంలో ఆధునాతన పద్ధతిలో మట్టి పాత్రల తయారీపై 10 రోజుల శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కెవిఐసి స్టేట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీప్ మాట్లాడుతూ గ్రామీణ కార్మికులు తమ సంప్రదాయ వృత్తులను కొనసాగించడమే కాకుండా, ఆధునాతన పరికరాలు, యంత్రాలను వినియోగిస్తే ఉత్పత్తి సామర్థ్యం పెరిగి ఆదాయ వనరులు విస్తరించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిఐసి జిఎం ప్రసాద్, ఖాదీ బోర్డు ఎగ్జిక్యూటివ్ సురేష్, కెవిఐసి అసిస్టెంట్ డైరెక్టర్ డి.సుబ్రహ్మణ్యం, సూపరింటెండెంట్ అప్పారావు, ఐవి.రమణ, అనకాపల్లి జిల్లా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అనకాపల్లి రామస్వామి, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలలో శ్రమదానం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని రాయపురఅగ్రహారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు పిల్లల అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు శ్రమదానం చేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి చెత్తను ఎత్తివేసి శుభ్రం చేశారు. డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

కళ తప్పిన వారపు సంత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రంలోని చెరకు కాటా వద్ద ప్రతి బుధవారం జరుగు వారపు సంత ఈ బుధవారం వెలవెల పోయింది. తుపాన్ కారణంగా ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో సంతకు వ్యాపారులు, కొనుగోలు దారులు పెద్దగా రాలేదు. దీంతో సంత జనం లేన వెలవెలబోయింది.

తుపాను ప్రాంతాల్లో అధికారులు, నాయకుల పర్యటన



చోడవరంలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రజాశక్తి -నక్కపల్లి: తుఫాన్ ప్రభావంగా కురిసిన వర్షానికి ముందస్తు యాజమాన్య చర్యలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు సూచించారు. మండలంలో కాగిత, ఉద్దండ పురం గ్రామాల్లో బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వరి పంట పొలాలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.ప్రస్తుతం కురిసిన వర్షానికి వరి పంటలు చాలా వరకు నక్కపల్లి, పాయకరావుపేట మండలాలలో ఆరోగ్యంగా ఉన్నాయని, ఆకు ముడత పురుగు ఉధృతి తగ్గిందని బిసిటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా అన్నారు. ప్రస్తుతం పిలక, అడుగుపొట్ట దశ లో ఉన్న వరి పంటలో కొన్నిచోట్ల పొటాషియం లోపం గుర్తించామన్నారు. వర్షం పూర్తిగా తగ్గిన తర్వాత అడుగు పొట్ట దశలో ఉన్న వరి పొలాలలో ఎకరాకు 20 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ 15 కిలోల యూరియా చల్లడం మంచిదని భూసార శాస్త్రవేత్త బుర్ల శ్రీహరిరావు రైతులకు సూచించారు. వరిలో ఎలకల యాజమాన్యం గురించి బ్రోమోడయోలిన్ మందు వాడే విధానాన్ని తెలియజేశారు.మోతాదుకు మించి ఎరువులను వాడడం ద్వారా చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉందని, నియంత్రించడం కూడా కష్టమవుతుందని తెలిపారు.నిర్దేశించిన మోతాదులో మాత్రమే ఎరువులు వాడాలని సూచించారు.క్షేత్ర సందర్శనలో సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్, నక్కపల్లి మండల వ్యవసాయ అధికారి ఇంచార్జ్ సుర శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణాధికారిణి జి. సాయి కుమారి, సత్యనారాయణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రశాంతి, ప్రసన్న పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో కౌన్సిలర్ మధు

నర్సీపట్నం టౌన్: తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో వరద నీరు పొలాలు, ఇళ్లల్లోకి చేరింది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గమనించి వార్డ్ కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. వరద నీరు నిల్వ ఉండకుండా చెరువుకు వెళ్లేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసి, నీటి ప్రవాహానికి మార్గం సుగమం అయ్యేలా చర్యలు చేపట్టారు. కౌన్సిలర్ మాట్లాడుతూ, వర్షాలు ఎంత తీవ్రమైనవి అయినా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే స్పందించడం మున్సిపాలిటీ బాధ్యత అని అన్నారు. మునిగిన ప్రాంతంలో వరద నీరు పూర్తిగా చెరువులోకి వెళ్ళేలా అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.



ఎస్.రాయవరంలో...

నక్కపల్లి: అన్ని గ్రామాల్లోనూ ముమ్మ రంగా శానిటేషన్ పనులు చేపట్టాలని ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మండలంలో బుధవారం పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. నక్కపల్లి, గుల్లిపాడు, రమణయ్యపేట, రేబాక, దోసలపాడు, జి జగన్నాధపురం, డొంకాడ, గొడిచెర్ల, కొత్తూరు తదితర గ్రామాల్లో పర్యటించి శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. తుఫాను ప్రభావంతో కురిసిన వర్షపు నీరు డ్రైనేజీలు, లోతట్టు ప్రాంతాలు, రోడ్లపై నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. తక్షణం డ్రైనేజీలను క్లీనింగ్ చేయించాలన్నారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వాటర్ ట్యాంక్‌లలో క్లోరినేషన్ చేయాలన్నారు. పలు గ్రామాల్లో దగ్గరుండి డ్రైనేజీలలో పూడికతీత పనులను చేయించారు.తుఫాన్ ప్రభావంతో జరిగే నష్టం పై ఆయా గ్రామాల్లో రివ్యూ చేశారు.

గొలుగొండ: మొంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటను మండల వ్యవసాయ అధికారి కె.సుధారాణి పరిశీలించారు. కొత్తమల్లంపేట, లింగంపేట, కృష్ణదేవిపేట, సీహెచ్.నాగాపురం గ్రామాలలో వరి పంటలను పరిశీలించారు. వర్షం, గాలి ప్రభావంతో పడిపోయిన మడుల్లో నీటిని పూర్తిగా తీసివేసి, 4-5 దుబ్బులను కలిపి కట్టుకోవాలని సూచించారు. పంటపై వాలిడామైసిన్ లేదా హెక్సాకోనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవడంతో తెగుళ్ల ఆశించకుండా ఉంటాయని సూచించారు. ఆకుముడత పురుగు ఆశిస్తే ఎమామెక్టిన్ బెంజోయేట్ మందును పిచికారీ చేసుకోవాలనీ, గింజ గట్టిపడే దశలో తడిస్తే 5 శాతం ఉప్పు నీటి ద్రావణం పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వెంకటరమణ, విఎఎ సత్యనారాయణ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో కలెక్టర్, అధికారుల పర్యటన

-చోడవరం : జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ బుధవారం చోడవరం పట్టణంలో పర్యటించారు. బాలాజీ నగర్, బాలయ్య కోనేరు, రెల్లివీధి తదితర ముంపు ప్రాంతాలను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. నూకాలమ్మ కళ్యాణమండపంలో పునరావాస కేంద్రంలో ఉన్న పేదలతో మాట్లాడారు. గత మూడు రోజులుగా ఇల్లులు నీటికి ముంపు గురై పునరావాస కేంద్రంలోని ఉంటున్నామని తమకు నివాస స్థలాల్లో పట్టాలు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని బానయ్య కోనేరు వాసులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీదేవి, ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీపీ గాడు నూకాలమ్మ, సర్పంచ్ బండి నూకాలమ్మ, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు, టిడిపి నాయకులు జి మల్లనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేవరాపల్లి మండలం రైవాడ జలాశయం పరిసరాల్లో నెలకొన్న వరద పరిస్థితులను జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆమెతో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, నీటిపారుదల, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు ఉన్నారు. జలాశయానికి వస్తున్న వరదనీటి ఇన్‌ఫ్లో, శారదా నదిలోకి విడుదల చేస్తున్న నీటి పరిమాణంపై ఇంజినీర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దేవరాపల్లిలోని రైవాడ జలాశయ అతిథి గృహంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఇంజినీర్లు ఎం. త్రినాథం, డిఈఈ జి.సత్యం నాయుడు, అనకాపల్లి ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి మంజులవాణి, తహశీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంపీడీఓ సువర్ణరాజు పాల్గొన్నారు.



నరీపట్నంలో సహాయక చర్యలు చేపడుతున్న కౌన్సిలర్

మంథా తుపాన్ సహాయక చర్యలపై మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో అత్యధికంగా 158 మిల్లీమీటర్ల వర్షపాతం మంగళ, బుధవారం నమోదైనట్లు తెలిపారు కార్యక్రమంలో తహశీల్దార్ పి.లక్ష్మిదేవి, సీఐ పైడపునాయుడు, ఎస్ఐ వి.సత్యనారాయణ, ఇరిగేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ ఏ.త్రినాథం, జలాశయం డిఈఈ సత్యం నాయుడు, ఎంపీడీఓ ఎంవి.సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : తుఫాన్ కారణంగా కసింకోట మండలంలో లోతట్టు ప్రాంతాలైన వై.తుని, జోగరావుపేట, పేరంటాలపాలెం, కసింకోట, వెదురుపర్తి, పల్లపు సోమవారం, ఏఎస్.పేట గ్రామాలను అనకాపల్లి డిఎస్‌పి యస్.శ్రావణి, సిఐ అల్లు స్వామి నాయుడు సందర్శించారు. ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్య నారాయణ జోగారావుపేట, ఏనుగు తుని గ్రామాలను సందర్శించి మునిగిపోయిన పంట పొలాలను పరిశీలించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహిక కార్యదర్శి దాడి రత్నాకర్ వై.తునిలో మునిగిన చెరుకు పంటలను పరిశీలించారు.

సబ్బవరం : మండలంలోని నీట మునిగిన పరిసర ప్రాంతాలను బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సుడిగాలి పర్యటన చేసి పరిశీలించారు. మండలంలోని టెక్కలిపాలెం, సబ్బవరం, గుల్లేపల్లి ప్రధాన రహదారి ఆదిరెడ్డిపాలెం వద్ద గల బొర్రమ్మ గడ్డ క్యాజువే, పినగాడి -మొగలి పురం రోడ్డులో వరి పొలాల్లోంచి రోడ్డుపైగా ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. సబ్బవరం -గుల్లేపల్లి రహదారి క్యాజ్‌వేపై నుండి రెండు రోజులుగా నీరు పొంగి ప్రవహించడంతో సుమారు 17 గ్రామాలకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో తహశీల్దారు బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, మండల ఇంజనీరింగ్ అధికారి పి.హరిణి, రోడ్లు భవనాల శాఖ అధికారులు, సీఐ జి.రామచంద్రరావు, జనసేన నేత కర్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

యస్.రాయవరం : తుపాను ప్రభావం వల్ల నీట మునిగిన వరి పొలాలను మండలంలో పలుచోట్ల మండల వ్యవసాయ అధికారి సౌజన్య సందర్శించారు. బుధవారం ఉదయం జెవి పాలెం, సైతరుపేట, సర్వసిద్ధి, ఉప్పరపల్లి, దార్లపూడి గ్రామాలలో వరి పొలాలను ఆమె సందర్శించారు. కార్యక్రమం సర్పంచ్‌లు వజ్రపు శంకర్రావు, రావి రమణబాబు పాల్గొన్నారు.



కశింకోటలో...

ఈదురు గాలులతో వర్షం

ప్రజాశక్తి- నక్కపల్లి: తుఫాన్ తీరం దాటడంతో బుధవారం ఉదయం ఈదురు గాలులతో వర్షం కురిసింది. మంగళవారం అర్ధరాత్రి తుఫాన్ తీరం దాటడంతో ఈదురు గాలులు విరుచుకు పడ్డాయి. బోరున గాలులు వీచడంతో ప్రజలు భయాందోళన కు గురయ్యారు. సముద్రం తీరంలో అలలు ఎగిసి పడ్డాయి. ఈదురు గాలులు వీయడంతో చలి వాతావరణం నెలకొంది.వర్షం ఎడతెరిపినివ్వడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పెద్దేరు నుంచి నీరు విడుదల

మాడుగుల: తుఫాను కారణంగా మండలంలోని రాయిపాలెం వద్ద నున్న పెద్దేరు జలాశయం లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుందని, ప్రస్తుతం నీటి మట్టం 135.45 మీటర్లు ఉందని జలాశయం పర్యవేక్షణ అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. దీంతో 1750 క్యూసెక్కులు నీటిని స్పిల్వే 3,4 గేట్లు ద్వారా విడుదల చేయడం జరిగిందన్నారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



మాడుగుల పెద్దేరు నుంచి నీరు విడుదల



నక్కపల్లిలో వీస్తున్న గాలులు

ఏకధాటిగా వర్షం

మాడుగుల: తుఫాను కారణంగా మాడుగుల కేంద్రంతో పాటు మండలంలో పలుచోట్ల గాలులతో పాటు వర్షం కురిసింది. తెల్లవారి 6 గంటల నుండి తేలికపాటి వర్షం కురవడంతో పాటు గాలులు వీచాయి. అనంతరం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు నుండి భారీ ఈదురు గాలులతోపాటు వర్షం పడింది. ముందస్తు తుఫాన్ హెచ్చరికల కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. తుఫాన్ తీవ్రత అధికంగా ఉంటుందని అధికారులు హెచ్చరించడంతో పనులకు వెళ్లకుండా ప్రయాణాలు కూడా కొంతమంది రద్దు పరుచుకున్నారు.

వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం కంఠాపురం పంచాయతీలో మొంథా తుపాన్ కారణంగా కురిసిన వర్షాల నేపథ్యంలో వాటర్ ట్యాంకులను ముమ్మరంగా క్లోరినేషన్ చేయించారు. సర్పంచ్ రాజేశ్వరి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కురిసిన వర్షాల నేపథ్యంలో ప్రజలు రోగాల బారిన పడకుండా వాటర్ ట్యాంకులకు క్లోరినేషన్ చేయించామని తెలి పారు. గ్రామాల్లో ప్రత్యేకంగా పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించినట్లు బ్లీచింగ్ చల్లించామని తెలిపారు. కార్యక్రమంలో ఆశ, అంగన్వాడీలు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



క్లోరినేషన్ చేపడుతున్న సిబ్బంది

రోలుగుంట రోడ్డు జలమయం

అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-రోలుగుంట: తుపాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు రోలుగుంట రోడ్డు చెరువును తలపిస్తోంది. ఈ రోడ్డుపై గోతులు ఏర్పడటంతో ఈ గోతుల్లో వర్షపు నీరు చేరి మరింత దారుణంగా మారుతోంది. దీంతో, వాహనదారులు నరకయాతన పడుతున్నారు. కొన్ని సమయాల్లో వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు తెలిపారు. ఇప్పటికైనా ఈ రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న రోడ్డు

బల్క్ డ్రగ్‌ను ఏర్పాటు చేయొద్దు

కొనసాగిన మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి- నక్కపల్లి: తమ జీవన విధానాన్ని, ఉనికిని దెబ్బతీసే బల్క్ డ్రగ్ భూతాన్ని ఏర్పాటు చేయొద్దని మత్స్యకారులు డిమాండ్ చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారుల చేపట్టిన శాంతియుత రిలే దీక్షలు బుధవారం నాటికి 46వ రోజుకు చేరుకుంది. తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా, ఈదురు గాలులకు టెంట్ చిరిగిపోయి పడిపోయినప్పటికీ మత్స్యకారులు బల్క్ డ్రగ్ పై పోరును కొనసాగించారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టొద్దని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సముద్రం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, దానికి దూరం చేయొద్దన్నారు. చేపల వేట తప్ప మరే వృత్తి తమకు తెలియదని, బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. బల్క్ డ్రగ్ ను రద్దు చేసే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు బి బాబ్జి, పిక్కి తాతీలు, గోసల సోమేశ్వరరావు, చేపల సోమేష్, కోడ కాశీరావు, సూరిబాబు, కాశీ, కోదండ, రమణ, మత్స్యకారులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న మత్స్యకారులు



శానిటేషన్ పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో

వసతి గృహంలో శానిటేషన్ పనులు

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి సాంఘిక సంక్షేమ ఎస్సీ వసతి గృహంలో ముమ్మరంగా శానిటేషన్ పనులు చేపట్టారు. ఈ నెల 27న ప్రజాశక్తిలో వసతిగృహం.. అపరశుభ్రం.. అనే శీర్షికన ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు స్పందించి బుధవారం వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులతో ముమ్మరంగా శానిటేషన్ పనులను చేయించారు. నిల్వ ఉన్న మురుగు నీటిని, రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

బాలల దినోత్సవ బ్రోచర్ విడుదల

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలో పీఆ ర్ టి యు ఆధ్వర్యంలో బాలల ప్రతిభ పాటవ పోటీలకు సంబంధించిన బ్రోచరను విశాఖ పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు విజయభాస్కర్ ం ఆవిష్కరించారు . పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు డి గోపీనాథ్ మాట్లాడుతూ జిల్లాస్థాయి బాలల ప్రతిభ పాటవా పోటీలు ఈనెల 31వ తేదీన నర్సీపట్నం లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన పోటీలతో ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు నవంబర్ఒకటవ తేదీన దేశభక్తి గీతాలు, 3న పద్య పఠన, 4న డిబేట్, 5న, 7న కళాకృతులు పోటీలు, 8న కాగితంతో కళాకృతులు,9న డిబేట్, 13న విచిత్ర వేషధారణ, 14న ఫైనల్ పోటీలు జరుగుతాయన్నారు.



నష్టపరిహారాన్ని అంచనా వేయాలి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం: మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలను, ఇళ్లను అధికారులు అంచనా వేయాలని స్పీకర్ అయ్యన్న సూచించారు. తుఫాను కారణంగా ప్రభుత్వం ముందస్తుగా అధికారులను, ప్రజలను అప్రమత్తం చేయడంతో ఎటువంటి ప్రాణం నష్టం జరగలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తుఫాను తీవ్రతను ముందుగానే అంచనా వేసి అధికారులను అప్రమత్తం చేశారని, దీంతో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించకుండా అధికారులు పనిచేశారని అభినందించారు, పశువులకు పశుగ్రాసం కొరత రాకుండా 50శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందించేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు, దెబ్బతిన్న రహదారులను గుర్తించాలని, ప్రజలకు నిరంతరం అధికారులు అందుబాటులో ఉండాలని అన్నారు,

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది. నియోజవర్గంలో అన్ని మండలాల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం మండలం అమలాపురం గ్రామంలో బుధవారం కోటి సంతకాలు సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నం మెడికల్ కాలేజీని కూటమి ప్రభుత్వం అన్యాయంగా ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇది ఈ ప్రాంత ప్రజలకు పెద్ద నష్టం జరుగుతుందని, మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ జరిగితే పేదలకు అందుతున్న ఉచిత వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోతాయని తీవ్రంగా విమర్శించారు. ప్రజల హక్కుల కోసం పోరాడటానికి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుర్ల రాజేశ్వరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

శామ్‌సంగ్ 'అందరికీ ఎఐ' థీమ్ ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శామ్‌సంగ్, ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసి) 2025లో 'అందరికీ ఎఐ' థీమ్‌ను ప్రదర్శించిందని సంస్థ ప్రతినిధి జెబి.పార్క్ తెలిపారు. విశాఖపట్నంలోని శామ్‌సంగ్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ ప్రదర్శన ద్వారా కృత్రిమ మేధస్సు, సాంకేతికత, ప్రజల జీవనశైలి, కనెక్టివిటీ, ఆవిష్కరణలను ఎలా మార్చబోతుందో చూపించిందని తెలిపారు. ఐఎంసి 2025లో 'ఇన్నోవేట్ టు ట్రాన్స్‌ఫార్మ్' అనే థీమ్‌కు అనుగుణంగా, శామ్‌సంగ్ తన ప్రదర్శనలో ఎఐ ఆధారిత జీవనం, సుస్థిర కనెక్టివిటీ భవిష్యత్తుకు జీవం పోసిందన్నారు.

కెకె లైన్‌లో విరిగిపడ్డ కొండ చరియలు

ప్రజాశక్తి-అనంతగిరి: కొత్తవలస-కిరండోల్ కేకే లైన్ మార్గమధ్య పట్టలపై కొండ చరియలు విరిగిపడ్డాయి. మండలంలోని మొంథా తుఫాన్ ప్రభావ కారణంగా కేకే లైన్ బొర్రా- చిమిడిపల్లి. 65/5 మైలురాయి సమీపంలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ముందస్తు చర్యల్లో భాగంగా విశాఖ -కొత్తవలస మీదుగా బొర్రా, .అరకు, కిరండోల్ కు వెళ్ళు పలు రైళను ఆది, సోమవారం రద్దు చేశారు. ఈ ఘటనను తెలుసుకున్న సంబంధిత రైల్వే శాఖ అధికారులు బుధవారం తెల్లవారుజాము నుండి పునరుద్ధరణ సహాయక చర్యలు ముమ్మరం చేశారు. పలు గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో కొండచరియలు విరిగిపడ్డాయి.

రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన సిపిఎం నేతలు



నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, తుమ్మపాల, ఊడేరు, దిబ్బపాలెం, మాటూరు, జగన్నాథపురం, అనకాపల్లి, గొలగాం తదితర గ్రామంలో సుమారు 4000 ఎకరాల్లో మొంథా తుఫాను కారణంగా వరి పంట మునిగిపోయిందని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శంకర్‌రావు, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు తదితర సిపిఎం నేతలు బుధవారం ముంపు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతికి వచ్చిన వరి పంట ముంపు గురై రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఎకరానికి రూ.20 వేలు నుంచి రూ.30 వేలు వరకు పెట్టుబడులు పెట్టారని, తీరా వారి పంట పొట్ట దశలోకి వచ్చినప్పుడు ఈ తుఫాను వలన మొత్తం పంటలు నాశనమైపోయినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇంతవరకూ ప్రభుత్వ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తగరంపూడి గ్రామంలో మాదాబత్తుల ఎల్లమ్మ పూరిపాక ఈ వర్షానికి కూలిపోవడంతో ఆ ఇంటిని పరిశీలించారు. బాధితరాలిను పరామర్శించారు. ఇల్లు నష్టపోయిన వారికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయాలని, లక్ష రూపాయలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె. ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాన్ని సందర్శించిన సిపిఎం నేత వెంకన్న

దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి సచివాలయంలో ప్రభుత్వం ఆదివాసీ గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం పరిశీలించారు. పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలో రాత్రి కరెంటు సరఫరా లేక ఇబ్బంది పడ్డామని, టార్పలిన్లు ఇవ్వకపోడంతో కింద పడుకున్నామని, బుధవారం ఉదయం 10 గంటల వరకు అల్పాహారం పెట్టలేదని, దీంతో చిన్న పిల్లలుతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ నవంబరు నెల బియ్యం ముందుగా సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ అదేశాలు జారీ చేసినా ఇక్కడి ఇవ్వలేదని తెలిపారు. తుపాన్ వల్ల పనులు కోల్పోయిన దళిత, గిరిజనులు, చేతివృత్తుల వారికి 35 కేజీల బియ్యం, పప్పులు, దుంపలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎర్రునాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న వెంకన్న